

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం


31 జనవరి 2026 పేజీలు : 08


## నగరంలో ఎటు చూసినా.. దోమలే !

- పూడికతీతకు నోచుకోని కాలవలు
- అధ్వాన్నంగా పారిశుద్ధ్యం
- ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగర పరిధిలో ఎటు చూసినా దోమల జోరుతో ప్రజలు అల్లాడుతున్నారు. వీటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా కాలవల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ప్రజలు కోరుతున్నారు. నెల్లూరు నగరంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కార్పొరేషన్ పరిధిలో విపరీతంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఈ దోమకాటు వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రజలు దోమ నివారణ కోసం దోమల బ్యాట్స్, జెట్ కాయిన్స్ వంటి వాటిని వాడుతున్నా.. వాటిని నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. డ్రైనేజీ వ్యవస్థని మెరుగు పరచడం, మురికినీరు నిల్వ లేకుండా చేయడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి తక్షణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలోని మురికివాడల ప్రాంతాల్లో దోమల జోరు ఎక్కువగా ఉంది. నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న మైనర్ కాలవలో పూడికతీత పనులకు నోచుకోకపోవడం విశేషం. అధికారులు నగరంలో అరకొర ఫాగింగ్ చేస్తున్నప్పటికీ.. ఫాగింగ్ చేసిన కొద్దిసేపటికే దోమలు విజృంభన తప్పడం లేదు.





కాలవల్లో స్ప్రే, ఆయిల్ బాల్స్ పూర్తిస్థాయిలో వేయడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తోంది. గతంలో కంటే ఈసారి అధికంగా దోమల ఉత్పత్తి కావడంతో నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. నగర పాలక సంస్థలో శానిటరీ విభాగంలో ఒక పక్క సిబ్బంది కొరత ఉండగా, మరోపక్క ఉన్న కొంత మంది డెప్యుటేషన్ల పేరుతో వారికి ఇష్టం వచ్చిన చోట్ల విధులు నిర్వహిస్తుండడం విశేషం. శానిటరీ విభాగంలో

## రైతుల గోడు తగిలింది..

### దగదర్తి తహసిల్దార్ ఇంటిపై ఏసీబీ దాడులు



జిల్లాలో దామవారం విమానాశ్రయం ఏర్పాటు కొందరికి వరంలా మారింది. రైతులు తమకు పరిహారం చెల్లించాలని తహసిల్దార్ కార్యాలయంపై అనేకరకాల ఫిర్యాదులు రాష్ట్ర ప్రభుత్వానికి చేశారు. కావలి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కూడా చేశారు. రైతులు భూముల్లో ప్రముఖ కంపెనీకి చెందిన పారిశ్రామిక వ్యక్తులతో దగదర్తి తహసిల్దార్ మరి కొంత మంది సిబ్బంది కలిసి హక్కుదారులైన రైతులు పేర్లు జాబితాలో లేకుండా చేశారని ఆరోపణలు వెలువెత్తాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు పొదలకూరు రోడ్‌లో నివాసముంటున్న దగదర్తి తహసిల్దార్ ఇంటిపై ఏసీబీ దాడులు వార్త సంచలనం రేపింది. అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 389 గ్రాములు బంగారం, లక్ష రూపాయలు నగదు, విలువైన ఇళ్ల స్థలాలకు సంబంధించిన పలు డాక్యూమెంట్‌లను ఏసీబీ అధికారులు స్వాధీన పరుచుకొన్నట్లు తెలిసింది. వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి.

వివరాలు 02లో



## జాతిపితకు ఎంపీ నివాళి

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

సత్యం, అహింసలనే ఆయుధంగా చేసుకుని స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శప్రాయులని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని వీపీఆర్ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

-మిగతా 2లో

## వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :**

బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం వాడివేడిగా జరిగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి అధ్యక్షతన జరిగిన సమావేశం.. ఓ దశలో వాకౌట్లు, రహస్య సమావేశాలతో వేడెక్కింది. ఎట్టకేలకు కౌన్సిలర్లందరూ బడ్జెట్‌ను ఆమోదించడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో బుచ్చి మునిసిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో కమీషనర్ బాలక్రిష్ణ, వైస్ ఛైర్మన్‌లు, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






02 పేజీలో

## విభేదాలు వీడి.. ఐకమత్యంగా ఉండండి

- టీడీపీ విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినవారిని ఆదరించండి
- ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి
- కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాకే ముదివర్తిపాలెం కాజ్ వే, నెల్లూరు మైపాడు రోడ్ల నిర్మాణాలలో పురోగతి
- ఇందుకూరుపేట టీడీపీ కార్యాలయం కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

# విభేదాలు వీడి ఐకమత్యంగా ఉండండి

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఎన్నికలకు ముందు చేసిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసిన కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. ఇందుకూరుపేట మండలం టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి పలువురు నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ జెండా జెండా మోసిన కార్యకర్తల సేవలకు సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ విధానాలు, చంద్రబాబు నాయుడు అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై కొత్తగా పార్టీలోకి చేరిన వారిని పాత నాయకులు ఆదరించాలని కోరారు. కొత్త పాత నాయకుల మధ్య సమన్వయం అవసరమని ఆమె నాయకులకు సూచించారు. ఏవైనా చిన్నపాటి మనస్పర్ధలు ఉంటే కూర్చుని పరిష్కరించుకోవాలని, నాయకుల మధ్య విభేదాలు అభివృద్ధికి ఆటంకాలు అవుతాయని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఆలోచన నిర్ణయాలు అస్తవ్యస్త విధానాల కారణంగా పేదలకు ఇంటి పట్టాల మంజూరులో జాప్యం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి కమిటీ సమస్యలు నిర్వహించి స్థానిక సమస్యలు గుర్తించి మండల స్థాయి నాయకులకు తెలపాలని, అక్కడ పరిష్కారం కానిపక్షంలో తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మండలస్థాయిలో నాయకుల మధ్య ఉన్న సయోధ్య గ్రామస్థాయిలో ఎందుకు లేదని, అపోహలు వీడి అందరూ ఐకమత్యంగా ఉండాలని నాయకులకు హితోపదేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో నాయకులకు అధికారులు సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముదువర్తిపాలెం కాజ్ వే, నెల్లూరు మైపాడు రోడ్ల నిర్మాణంలో సాధించిన పురోగతిని ఆమె సమావేశంలో ప్రస్తావించారు. పెన్నానది పొర్లు కట్టల నిర్మాణాలకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుందని, ఆ దిశగా తాను చేస్తున్న కృషిని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. ఇందుకూరుపేట మండలంలోని ప్రతి గ్రామంలో 10 నుంచి 20 లక్షల విలువ చేసే కొద్ది పనులు చేశామని దశల వారీగా రోడ్లు, డ్రైన్లు నిర్మించి గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర మీవీజు డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అమరేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చెంచు కిషోర్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు పిఎల్ రావు, కోడూరు కమలాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కూకటి వెంకటేశ్వర్లు, మండల బీసీ సెల్ అధ్యక్షులు మారుబోయిన జనార్ధన్‌గౌడ్, తెలుగు యువత అధ్యక్షులు చంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాదులు





**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 11 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో క్షేత స్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే మండలాల వారీగా కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కొడవలూరు మండల టిడిపి ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి స్థానిక నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు లోకేష్‌ల వరకు సంక్షేమం, అభివృద్ధే తెలుగుదేశం పార్టీ విధానమన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే తాను రాజకీయాలలోకి వచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. మండలంలో టీడీపీ నాయకులందరూ ఐకమత్యంగా ఉంటూ ఇక్కడ మరో పార్టీకి అవకాశం లేదన్నట్టుగా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. నాయకుల మధ్య అనైక్యత అభివృద్ధికి ఆటంకం అన్నారు. కొత్త పాత నాయకులు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు అండగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. నాయకుల మధ్య ఏమైనా స్వల్ప విభేదాలుంటే కలిసి కూర్చొని పరిష్కరించుకోవాలని కోరారు. తన విజయం కోసం పని చేసిన ప్రతి కార్యకర్త కూడా నాయకుడినని, కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా.. స్థానిక నాయకుల దృష్టికి తేవాలని తెలిపారు. అలా కానీపక్షంలో నేరుగా తన వద్దకు రావచ్చని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కార్యకర్తలను కోరారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదులని, పార్టీ జెండా మోసిన కార్యకర్తల కష్టం తనకు తెలుసన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాటలతో సమావేశానికి హాజరైన కార్యకర్తలు సంతోషంతో కేరింతలు కొట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, తల్లికి వందనం, మత్స్యకార సేవలలో తదితర సంక్షేమ పథకాలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకులు, కార్యకర్తలను కోరారు. అలకలు వీడి నాయకులు అందరూ ఐకమత్యంగా తనకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

- కొత్త, పాత నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేయండి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్‌ల స్ఫూర్తితో కార్యకర్తలు పని చేయాలి
- కొడవలూరు టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ జివిఎన్ శేఖర్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధు, మండల రైతు సంఘం అధ్యక్షుడు సురేష్ రెడ్డి, ఎల్లాయపాలెం గుండాలమ్మపాలెం సొసైటీల అధ్యక్షులు వంశి రెడ్డి, వినీల్ రెడ్డి, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కరకట్ట మల్లికార్జున, ఎస్సి సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, టిడిపి నాయకులు చెక్క మదన్, సతీష్ రెడ్డిలతో పాటు యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

### రైతులు గోడు తగిలింది..

## దగదర్తి తహసిల్దార్ ఇంటిపై ఏసీబీ దాడులు





**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఆదాయానికి మించి ఆస్తుల ఫిర్యాదులతో ఏపీలో ఏసీబీ వరుస దాడులు చేస్తోంది. గురువారం ఒకేసారి రెండు చోట్ల మెరుపు దాడులు చేసిన అధికారులు.. నెల్లూరు జిల్లా దగదర్తి తహసిల్దార్ పాలకృష్ణ ఇళ్లలోను తనిఖీలు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో 8 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. పాలకృష్ణ, అతని మిత్రులు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో నగదు, బంగారం, ఇతర ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. న్యాయశాఖ ఉద్యోగులపై మరో ఫిర్యాదుతో ఐదు చోట్ల తనిఖీలు జరుగుతున్నాయి. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

## నగరంలో ఎటు చూసినా.. దోమలే !

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తున్న వారి వివరాలు పూర్తిస్థాయిలో అధికారులు ఉన్నతాధికారులకు చూపకపోవడంతో గత కొంతకాలంగా వారు డెప్యుటేషన్‌లోనే విధులు నిర్వహించడం విశేషం. అదేవిధంగా నగరపాలక సంస్థ పరిధిలో 166 సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో శానిటరీ అధికారులు ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేక పారిశుద్ధ్యం పలు ప్రాంతాల్లో అధ్వానంగా మారిందని పలువురు వాపోతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 9 లక్షల మంది జనాభా ఉండగా.. కేవలం గత కొంతకాలం నుంచి ఒక హెల్త్ ఆఫీసర్ పోస్ట్ ఉండడంతో శానిటరీ విభాగంపై పూర్తిస్థాయిలో అధికారులు పట్టు సాధించలేకపోతున్నారు. ఎంతో కీలకమైన ఈ విభాగానికి నెల్లూరు రూరల్, నెల్లూరు నగరానికి సంబంధించి ఇద్దరు హెల్త్ ఆఫీసర్లు నియమిస్తే.. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దోమల నివారణకు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇకనైనా మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## జాతిపితకు ఎంపీ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

గాంధీజి పోరాటాల స్ఫూర్తిని నేటి యువత ముందుకు తీసుకుపోవాలన్నారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పేదలు, గ్రామీణ ప్రజలు, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి గాంధీజీ అని గుర్తు చేశారు. గాంధీజీ కలలు కన్న సుపరిపాలనను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించి గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ కలలు కన్నారని, గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి కూటమి ప్రభుత్వం ఆయన కలలను నిజం చేస్తోందన్నారు.

## గాంధీజీ అహింసా మార్గం భావితరాలకు ఆదర్శం కావాలి

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** గాంధీజీ పాద ధూళితో పునీతమైన పల్లిపాడు గాంధీ ఆశ్రమం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరు నియోజకవర్గంలో ఉండడం తన అదృష్టమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా పల్లిపాడు గాంధీ ఆశ్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆశ్రమ నిర్వాహకులు, విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. నేటి తరానికి మహాత్మా గాంధీ క్రమశిక్షణ, దేశభక్తి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. పొణకా కనకమ్మ, చతుర్వేదుల కృష్ణయ్య వంటి మహానుభావుల కృషితో నిర్మించిన పల్లిపాడు గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గాంధీ మహాత్ముడి వర్ధంతి సందర్భంగా స్వయంగా రాట్నం తిప్పిన పల్లిపాడు ఆశ్రమం మనకు అహింస అనే ఆయుధాన్ని అందించిన యుద్ధ క్షేత్రంగా అభివర్ణించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వాకటి విజయకుమార్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు యలమూరు రంగయ్యానాయుడులతో పాటు పలువురు గాంధేయవాదులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అదానికి భూపందార నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి : సీపీఐ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అదానీకి కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలని అక్రమంగా భూపందార నిర్ణయం చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకిస్తుందని రాష్ట్ర మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **గత ప్రభుత్వంపై విమర్శ :** అదానీ గ్రూప్ కృష్ణపట్నం పోర్టును తీసుకున్నాక కంటైనర్ టెర్మినల్‌ను మూసివేసి, తన సొంత పోర్టులకు తరలించింది. దీనిపై గతంలో ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అరిగెల సాయి విమర్శించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వామపక్షాలతో కలిసి పోరాటం చేస్తూ, తాము అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా టెర్మినల్ పునరుద్ధరణ విషయంలో న్యాయం జరగకపోగా, అదానీకి అక్రమంగా భూములను కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల ముందు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరకపోగా ఆ మాటలు కేవలం మాటలుగానే మిగిలిపోయాయన్నారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి కంటైనర్ టెర్మినల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం కేటాయించిన అటవీ భూములకు బదులుగా నెల్లూరు జిల్లాలో ఐదు మండలాల్లో 1030 ఎకరాలను అటవీ శాఖకు బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. అక్కడ కంటైనర్ టర్మినల్ మూతపడ్డ సంగతి ఈ ప్రభుత్వ యంత్రాంగానికి తెలియకపోవడం విడ్డూరంగా ఉంది అన్నారు. ఆ ప్రభుత్వ భూముల్లో అనేక మంది పేదలు అనేక సంవత్సరాల నుంచి సాగుచేసుకుని జీవిస్తున్నారు అని తెలిపారు. వారి నోట మట్టి కొట్టే విధంగా ఈరోజు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదానీ పట్ల ప్రేమ కురిపిస్తుందన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ని మూసివేసిన ఆదాని కృష్ణపట్నం పోర్టు యాజమాన్యంపై చర్య తీసుకోకుండా, ఆ భూముల మీద ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా పేదలు సాగు చేసుకుంటున్న పోరంబోకు భూములను, ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. నెల్లూరు జిల్లాలో వేలాది ఎకరాలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి ఆ భూముల్లో ఎటువంటి పరిశ్రమలు నిర్మించకుండా వృధాగా ఉన్నాయి. ఈ విషయం గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తే మంచిదని ఒక్కసారి పాలకులు ప్రజా సంక్షేమం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి అరిగెల సాయి సూచించారు.

# గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై ప్రతిజ్ఞ

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించే సందర్భంగా ముందుగా నెల్లూరు సిటీ గాంధీ బొమ్మ సెంటర్లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి సిపిఎం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం నివాళులు అర్పించారు. అనంతరం గాంధీజీ విగ్రహం ముందు నాయకులు కార్యకర్తలు చట్టం పరిరక్షణకై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞ ప్రతిని మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం చదివి అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం, సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. ప్రపంచంలో జరిగిన మార్పులలో 20వ శతాబ్దంలో అత్యధిక ప్రభావేతం చేసిన వ్యక్తులలో మహాత్మాగాంధీజీ ఒకరని అన్నారు. మతసామరస్యం అహింస మొదలగు అంశాలపై జాతి యావత్తుని ఒక్కతాటిపై నడిపించిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని కొనియాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత దేశంలో గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు తగ్గాయని అన్నారు. నేడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, చట్టం పేరులో ఉన్న మహాత్మా గాంధీజీ పేరును తొలగిస్తూ గ్రామీణ పేదల పని హక్కుకు తూట్లు పొడుస్తూ అనేక సవరణలు కేంద్ర ప్రభుత్వం చేయడం జరిగిందన్నారు. దీనివల్ల పేదలకు ఉన్న పని హక్కు కోల్పోవడం జరిగిందని




తెలిపారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ గ్రామీణ ప్రజల ఉపాధిని లేకుండా బిజెపి ప్రభుత్వం చేయడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. గతంలో 90 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయింపు చట్టంలో ఉండగా అమలు కస్టసాద్యంగానే కొనసాగిందని ఇప్పుడు దాన్ని 60 శాతం చేయడం వల్ల పథకం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని తెలిపారు. పాత పద్ధతిలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్, కత్తి పద్మ, అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి, చెంగయ్య, చిరంజీవి, ఫయాజ్, ఏమేలు తదితరులు పాల్గొన్నారు.

# లడ్డులో కల్తీలేదని తేటతెల్లం చేసిన సీబీఐ



- కూటమినేతలకు చెంపపెట్టు
- నీలాపనిందలు నిలబడవు
- ఆలయంలో ప్రత్యేకపూజలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డుల్లో ఎలాంటి కల్తీలేదంటూ సిబిఐ తేటతెల్లం చేసిందని, కూటమి నేతలకు చెంపపెట్టు అని, నీలాపనిందలు నిలబడబోవని రుజువైందని ఆత్మకూరు వైసిపి నేతలు పేర్కొన్నారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక జెఆర్‌పేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వారు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. దేవదేవుని దయవలన కూటమి నాయకులు చేసిన ఆరోపణల్లో నిజంలేదని తేలడంతో తాము ప్రత్యేకంగా పూజలు నిర్వహించామని వారు పేర్కొన్నారు. పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు ,మాజీ జెడ్పిటిసి సభ్యులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్యలు మాట్లాడుతూ తిరుమల లడ్డుల్లో కల్తీజరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు, ఇతర కూటమినేతలు తీవ్రంగా తమ పార్టీనేతలపై ఆరోపణలు చేశారని, నీలాపనిందలు వేశారని, తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఇతర తమ పార్టీ నాయకులపై బురదజల్లే యత్నం తీవ్రంగా చేశారని, కానీ ఎలాంటి కల్తీలేదంటూ సిబిఐ తేల్చిచెప్పిందని వారు పేర్కొన్నారు. ఇంకా ఆ నిజాలను కప్పిపుచ్చి తమ పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తూ వాస్తవాన్ని ఉటంకిస్తుండడం అత్యంత విచారకరంగా ఉందన్నారు. కూటమినేతలకు సిబిఐ చెంపపెట్టు వేసినా ఇంకా వారికి బుద్ధి రావడం లేదని విమర్శించారు. నెయ్యిలో కల్తీ లేకున్నా హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా కూటమినేతలు ఆరోపణలు చేశారని, ప్రజలను నమ్మించేందుకు యత్నించారని, కానీ దేవదేవుడు కళ్ళు తెరిచారని, నెయ్యిలో కల్తీలేదని సిబిఐ తేల్చేసిందన్నారు. ఇంకా ప్రజలను నమ్మించేందుకు తమ నాయకులపై విమర్శలు చేస్తుండడం విచారకరమని, దేవదేవుడు వారిపై తప్పకుండా చర్యలు తీసుకునేలా చేస్తాడన్న విశ్వాసం తమకుందని డాక్టర్ ఆదిశేషయ్య, ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పులిమి రమేష్‌రెడ్డి, నందా ఓబులేశు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, మీరామొహిద్దీన్, కల్పనారెడ్డి, కలామ్, రహీమ్, తోడేటి మణి, మద్దాళి సతీష్, బాలఅంకయ్య, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఏవో రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్యాలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ దేశ స్వాతంత్రం కోసం అనేక ఉద్యమాలు నడిపి జైళ్ళకు వెళ్లారని అలాంటి మహనీయుని వర్ధంతిని జరుపుకోవడం గర్వకారణం అన్నారు గాంధీ భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చేందుకు సత్యం అహింస అని ఆయుధాలను చేపట్టి అహింసా మార్గంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన నేతగా పేరు పొందాలన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ వనిపెంట వెంకటసుబ్బారెడ్డి పట్టణ అధ్యక్షులు గురజాల గోపి ఎమ్మెస్ నాయుడు, పి.మాల్యాద్రి కొండపల్లి వెంకటేశ్వర నాయుడు నూతలపాటి జయలక్ష్మి కోడూరు నాగిరెడ్డి చల్ల శ్రీనివాసులు యాదవ్ అంబటి ఈశ్వర్‌రెడ్డి బండారు సత్యనారాయణ శ్రీనివాసులు ఎల్లాల రమణారెడ్డి కాటం రమణారెడ్డి షేక్ రఫీ కిషోర్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ జీ.శ్రీనివాసులు, సీఆర్‌ఎంటి కస్తూరయ్యలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న సందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయం నందు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-1 తిరుపతయ్య మాట్లాడుతూ.. అవార్డు గ్రహీతలు ఇరువురు విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో అంకితభావంతో పనిచేస్తూ, అందరి మన్ననలు పొంది గణతంత్ర దినోత్సవ సేవా అవార్డుకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు.మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఇరువురి పనితీరును ప్రశంసిస్తూ వారి సేవలను ఘనంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటిలు, సహిత విద్య ఉపాధ్యాయులు, ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవార్డుగ్రహీతకు అభినందనసన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు పొందిన ఆత్మకూరు మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సంకె కొండయ్యను శుక్రవారం పలువురు నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. కొండయ్య అత్యంత చిత్తశుద్ధిగా విధులు నిర్వహిస్తుంటారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా యంత్రాంగం ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొండయ్య జిల్లా కలెక్టర్ హిమాన్ష్‌శుక్లా చేతులమీదుగా ఉత్తమ జిల్లా అవార్డును స్వీకరించారు. దాంతో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు దావా పెంచల రావు, బిసి నాయకుడు ఒంటేరు మల్లికార్జునల ఆధ్వర్యంలో కొండయ్యను శాలువా, పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించి అబినందనలు తెలిపారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని అవార్డులు స్వీకరించాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో డిప్యుటి తహశిల్దారు స్వరూప్, గురుకుల పాఠశాల కమిటీ చైర్మెన్ బాలకృష్ణ, టిడిపి మండల ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు జూగుంట చినకొండయ్య, చెవుల వెంగయ్యయాదవ్, విఆర్వో చిన్నయ్య,పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనం పర్యటనకు హాజరైన నలిశెట్టి బృందం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం సోమశిలలోని వివిధ కార్యక్రమాల్లో మంత్రి ఆనం, ప్రభుత్వ సలహాదారులు గుంద్ర సతీష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్, అనంతసాగరం మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఉదయగిరి రవి, జనసేన నాయకులు సురేంద్ర, ఎం.కృష్ణ మంత్రి ఆనం, ప్రభుత్వ సలహాదారులు గుంద్రా సతీష్ రెడ్డితో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# పీఎంపీ, రూడ్స్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని భక్తవత్సల నగర్‌లోని డేమియన్ ఫౌండేషన్ లెప్రసీ సెంటర్ నందు గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడి రోగులకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ మాట్లాడుతూ.. అహింసే నా ఆయుధం సత్యమే నాశక్తి అని ప్రపంచానికి మార్గదర్శనం చేసిన మహానుభావుడు మహాత్మా గాంధీఅని, ఆయన జీవితం మాటలకంటే కార్యాలే గొప్పవని మనకు నేర్పిందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనే కాదు, మానవ విలువల పరిరక్షణలో కూడా ఆయన ఆదర్శప్రాయుడని, గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గం నేటి తరాలకు వెలుగుదారని, గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను మన జీవితాల్లో అమలు చేయాలని సంకల్పిద్దామని, బ్రిటిష్ వారిని భారతదేశం నుండి వెళ్ళగొట్టడం లో ఆయన చేసినటువంటి అనేక త్యాగాలు నేటి యువతకు తెలియజేయాల్సి




నటువంటి అవసరం మనందరి మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డేమిన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్ సతీష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, డాక్టర్ ఐ.శాంతి, పీహెచ్‌పీ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, శ్రీధర్‌రావు, శంకర్రావు, గురుస్వామి, అపర్ణ, బీన, భవాని, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తులపై వివక్షత చూపరాదు

## డేమియన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.సతీష్




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా), డేమియన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ లెప్రసీ డే (ప్రపంచ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం) సందర్భంగా కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు, పండ్లు, బిస్కెట్స్, స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డేమియన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.సతీష్ పాల్గొని మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి బారిన పడిన వ్యక్తులను వివక్షతతో చూడరాదని, వారి గౌరవాన్ని కాపాడాలని అన్నారు. డేమియన్ ఫౌండేషన్ అర్బన్ లెప్రసీ అండ్ టీబీ సెంటర్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా గత 32 ఏళ్లుగా సమాజానికి అందిస్తున్న అంకితభావంతో కూడిన ఉచిత సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసినారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించడంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) లు పాత్ర అత్యంత కీలకమైనదని మేము గుర్తిస్తున్నామని. ఈలక్ష్యంలో మాతో భాగస్వాములు కావాలని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నామని కోరారు.కుష్టు వ్యాధి నివారణ, చికిత్సలో మేము ఈ క్రింది ఉచిత సేవలను అందిస్తున్నామని అన్నారు. అనుమానిత కేసుల నిర్ధారణ, పూర్తి స్థాయి యండిటి (మల్టీ-డ్రగ్ థెరపీ) చికిత్స. లెప్రసీ రియాక్షన్స్, మొండి పుండ్ల నిర్వహణలో ప్రత్యేక సంరక్షణ తీసుకుంటున్నామని, వైకల్యం ఉన్న రోగులకు ఉచిత పునర్నిర్మాణ శస్త్రచికిత్స, ఆసుపత్రిలో 24 పడకల సౌకర్యం కలదు, తీవ్రమైన సమస్యలు ఉన్నవారికి ఇక్కడ ఉండి చికిత్స పొందే సదుపాయం ఉందన్నారు. కేవలం వైద్యమే కాకుండా, రోగులు గౌరవప్రదంగా జీవించడానికి అవసరమైన సామాజిక, ఆర్థిక మద్దతును కూడా అందిస్తున్నామన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఐ.శాంతి మాట్లాడుతూ.. ప్రధానంగా కుష్టు వ్యాధి లక్షణాలలో చర్మంపై స్పర్శ లేని మచ్చలు, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బొడిపెలు, కనురెప్పలు కనుబొమ్మలు వాలిపోవడం, కాళు ్లు, చేతులు తిమ్మిర్లు, వాపులు, ముక్కదూలం అనిగిపోవుట గాని, గాలి ఆడకపోవడం గాని జరుగుతుందని, బొటనవేలు, చిటికెనవేలు, మనికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్ళు నేలకు రాసుకోవడం, పాదాలలో చెప్పులు జారిపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు పుండ్లు రావడం జరుగుతుందని, కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియం లేప్రీ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం వలన, దగ్గడం వల్ల వ్యాప్తి చెందుతాయని, వ్యాధి లక్షణాలు కనిపించుటకు మూడు నుండి ఐదు సంవత్సరాలు పట్టవచ్చు అని అన్నారు. అనంతరం సరస్వతమ్మ అనే కుష్టు వ్యాధి బాధితరాలును శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అక్కడ అడ్మిట్ అయిన రోగులకు పండ్లు, బిస్కెట్లు, స్వీట్స్ పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నేషనల్ కౌన్సిల్ మెంబర్ అనుముల జయప్రకాష్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, ఫిజియోథెరపిస్ట్ పీటర్ పాల్, జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, శ్రీధర్ రావు, శంకర్రావు, అపర్ణ, పేట్రీషియా ప్రైమ్ రాజ్, భవాని, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల హై లెవెల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్టులకు

# అత్యధిక నిధులు కేటాయించాలి

## తెలుగు గంగ ఈఈ రాధాకృష్ణమూర్తికి బీజేపీ వినతి

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జల వనరుల శాఖలో అంతర్భాగమైన సోమశిల హై లెవెల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతూ శుక్రవారం తెలుగు గంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాధాకృష్ణమూర్తికి పలువురు బిజెపి నాయకులతో కలిసి బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మిడతల రమేష్ మాట్లాడుతూ.. నిధులు లేక పనులు ఆగిన సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్లో మొదటి ప్రాధాన్యత నివ్వాలని, ప్రత్యేకించి నెల్లూరు జిల్లాలో సోమశిల హై లెవెల్ కెనాల్, దెబ్బ తిన్న సోమశిల ఆఫ్రాన్, కండలేరు మట్టి కట్ట పటిష్టత పనులకు సంబంధించి భారీగా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రత్యేకించి వెలుగొండ ప్రాజెక్ట్ కు వెంటనే గేట్లు బిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. వెలిగొండ ఒక టన్నల్ నిర్మాణం పూర్తయిందని, జలాశయానికి గేట్లు బిగించి కాలువలలోకి నీరు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెలిగొండ నుండి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నీరందిస్తే నెల్లూరు జిల్లాలో ఉదయగిరి, ఆత్మకూరు మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. కానీ




తెలంగాణ అభ్యంతరాలతో ఈ ప్రాజెక్టు వివాదాస్పదంగా మారిందన్నారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు, అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయితే శ్రీశైలంలో నీటి కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో సమగ్ర రైతు ప్రయోజనాల దృష్ట్యా నిధులు లేక నత్తనడకన నడుస్తున్న ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించి మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని, కరువు పీడిత గ్రామాలకు సమృద్ధిగానీరు అందించాలని రమేష్ అందజేసిన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అల్లూరు నాగేంద్ర సింగ్, నారాయణ యాదవ్ టి.శ్రీనివాసులు వీరాస్వామి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గుడిపల్లి కాలువలో చెత్త తొలగింపు



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** స్థానిక ఖాజానగర్ 7వవార్డు పరిధిలోని గుడిపల్లికాలువ గత కొన్ని రోజులుగా చెత్తతో పూడుకు పోయి దుర్వాసన వస్తుండడంతో స్థానిక టీడీపీ నాయకులు మునిసిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, కమీషనర్ బాలక్రిష్ణల దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం పారిశుధ్య కార్మికులను పంపి కాలువలోని పూర్తిగా తొలగించి, దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ వేయించడం జరిగింది. దీంతో ఎన్నో రోజులుగా ఉన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన స్థానిక నాయకులు సందాని, సుబహాని, అల్తాఫ్‌లను స్థానికులు అభినందించారు.

## చెర్లోపల్లి, అక్కంపేట గ్రామాలలో పశువైద్య శిబిరాలు



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య ఆరోగ్య శిబిరాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మనుబోలు మండల పరిధిలోని చెర్లోపల్లి, అక్కంపేట గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకులు కలికి వేణుగోపాల్ రెడ్డి యువజన నాయకులు మనుబోలు సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు పొన్నూరు అశోక్, మనుబోలు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పి.గురవారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో40 సాధారణ చికిత్సలు 45 గేదెలకు గర్భకోస నివారణ చికిత్సలు అదేవిధంగా 31 గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా 467 పశువులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. 301 దూడలకు, 495 గొర్రెలకు, మేకలకు నటల నివారణ ముందును, 394 షీప్ ఫాక్స్, 307 కోళ్ల టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిడూరు, వీరంపల్లి పశు వైద్యాధికారులు డాక్టర్ డి.కార్తీక్, డా.నూర్ బాషా మొహమ్మద్ షరీఫ్, ఏహెచ్‌లు షేక్ షబ్బీర్ అహమ్మద్, ఎన్.నవీన, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## మహాత్మునికి ఘన నివాళులు : జనసేన పార్టీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని జనసేన పార్టీ నెల్లూరు జిల్లా, గోమతి నగర్ కార్యాలయం ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, వీరా మహిళ శాంతికల మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ లిఅహింస, సత్యం, న్యాయం అనే విలువలతో దేశానికి దారి చూపిన మహానుభావుడని, బ్రిటిష్ సామ్రాజ్యంలాంటి శక్తివంతమైన పాలనను అహింస అనే ఆయుధంతో ఓడించి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకుడు గాంధీజీ అని కొనియాడారు. దళితులు, పేదలు, గ్రామీణ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజానాయకుడు గాంధీజీ అని తెలిపారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాల స్ఫూర్తితోనే లిజనసేన పార్టీ ఆవిర్భవించిందని, ఆయన ఆశయ సాధనకు లిడిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు అహర్నిశలు కృషి చేస్తున్నారనిలి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా లికూటమి ప్రభుత్వం పార్టీలు, వర్గాలకు అతీతంగాలి ప్రజల కోసం పాలన సాగిస్తోందని, గత ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిస్తే, ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకంగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగాలి పనిచేస్తోందని అన్నారు. మహాత్మా గాంధీజీ ఆశయ సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా యువత గాంధీ అడుగుజాడల్లో నడిచి ఆయన స్ఫూర్తిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందనిలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మార్కెట్ సురేష్ (ఏఎంసీ) డైరెక్టర్ రవికుమార్, మహేష్ శర్మ,బాలు, పేనేటి శ్రీకాంత్, గుత్తి శ్రీకాంత్, దివాణం సురేష్ బాబు, హరిబాబు, రాజేష్, వెంకట్, నరహరి, హర్ష, అన్సార్ బాషా, ఆఫీస్ ఇన్‌చార్జ్ జమీర్, వీర మహిళలు శాంతికళ (దిశా కమిటీ మెంబర్) వాణి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 2005 ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పని హక్కు గ్యారంటీ లేని విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేయాలని, 2005 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని కోరుతూ నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ 79వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం మహాత్ముని చిత్రపటం ఎదుట ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ స్ఫూర్తితో గ్రామీణ పేదలకు రైతులకు కూలీలకు అండగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి పని హక్కును, పురుషులతోపాటు మహిళలకు సమాన వేతనం ఇస్తున్న గ్రామా భివృద్ధికి తోడ్పడి, శ్రమకు గౌరవాన్ని ఇచ్చి నటువంటి ఈ చట్టాన్ని కాపాడుకోవాలని, ఈ చట్టం లో జాతిపిత మహాత్మా గాంధీ పేరునుతొలగించి గాడ్సే పేరు వచ్చేలా విబిజి రాంజీ చట్టం తేవడాన్ని వెనక్కి తీసుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఉద్యమిస్తామని గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్నామని తెలిపారు. కొనసాగింపుగా ఫిబ్రవరి 1, 2 తేదీలలో గ్రామాలలో సంతకాల సేకరణ చేసి 4వ తేదీ సచివాలయ అధికారులకు అర్జీలు ఇవ్వాలని, 5వ తేదీ ఎంపీడీవో ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పొదర్తి మస్తానయ్య, ముత్యాల నాగయ్య, అట్లా అనిల్, జా నా లక్ష్మీ ప్రసాద్, పర్చూరు ప్రభాకర్, శ్రీపతి వెంకయ్య, గుడి రవీంద్ర, బాలు ఆదిశేషయ్య, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, నాసిన మధు, జడ వెంకటేశ్వర్లు, ఎస్కే అబ్దుల్లా, బండి మురళి, ఎస్‌కే నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముని 78వ వర్ధంతికి కాంగ్రెస్ ఘన నివాళి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్‌లు ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జీవితం అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, సర్వోదయం వంటి సూత్రాలతో నిండినదని, 'హే రామ్' అంటూ ప్రాణాలు విడిచిన ఆ మహనీ భావుడి ఆదర్శాలు ఇప్పటికీ ప్రపంచానికి శాంతి, సమానత్వం మార్గాన్ని చూపుతున్నాయని వివరించారు. ఆయన మార్గమే దేశ భవిష్యత్తుకు శిరోధార్యంగా నిలుస్తోందని, ఆయన పేరు మీదుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదల హక్కుగా కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందని, ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తీసివేసి జిరాంజి పథకం తీసుకొచ్చి మన్రేగా పథకాన్ని తూట్లు పొడిచిందని, నూతన పథకం పేదల హక్కు ను ఆత్మగౌరవాన్ని తుడిచిపెట్టుతుందని సంజయ్ విమర్శించారు. ఫిబ్రవరి 2న అనంతపురం బండ్లపల్లి లో పిసిసి అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మన్రేగా తిరిగి పునఃస్థాపన చేసేవరకు ఉద్యమిస్తుందని, నెల్లూరు జిల్లాలో డిసిసి అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ కలిసి ఉద్యమిస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర పురం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ప్రసాద్, బుచ్చి కిషోర్, ముద్దిగుంట శీనయ్య, మస్తాన్, దావుద్, చైతన్య, అభి, పి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీకి ఘన నివాళులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్వాస్టిక్ సెంటర్ నందు జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు,స్వాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ శుక్రవారం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆలోచనలు, భావాలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయని, తన సిద్ధాంత బలంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఓడించి దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చారని,ఆయన పోరాట పంథా వినూత్నమైనది. అహింస అనే ఆయుధంతో, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి పోరాట రూపాలతో ఆయన యుద్ధం చేశారని తెలియజేశారు. అదేవిధంగా'క్విట్ ఇండియా' ఉద్యమంలో గాంధీజీ ఇచ్చిన నినాదం 'డూ ఆర్ డై' ఎందరినో ఉత్తేజితులను చేసిందని' విజయమో, వీర స్వర్గమో' అనే నినాదంతో యావత్ దేశ ప్రజలను ప్రభావితం చేసి భారతదేశం నుంచి బ్రిటిష్ వారు పారిపోయే విధంగా చేశారని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ పిల్లలు సిబ్బంది కూడా మహాత్మా గాంధీ యొక్క సిద్ధాంతాలైన సత్యం, అహింస అనే విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వాస్టిక్ సెంటర్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిమలూరు ఉన్నతపాఠశాల తనిఖీ : డీప్యూటీ డీఈఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆత్మకూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి జానకి రామయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన స్కూల్ రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో పదవతరగతి 100రోజుల ప్రత్యేక కార్యక్రమం గురించి ఆయన చర్చించారు. విద్యార్థులందరూ నూటికినూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శ్రద్ధతో అభ్యశించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు సులభమైన బోధనా పద్ధతులద్వారా పరీక్షలకు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులందరినీ ఒక ఉన్నత లక్ష్యం ఎంచుకొని తదనుగుణంగా3 అభ్యాసం గావించాలని సూచించారు. లక్ష్యసాధనకు పట్టుదలగా కృషిచేయాలన్నారు. భారతదేశం గర్వించదగిన ప్రముఖ శాస్త్రవేత్త, డిఆర్‌డిఓ మాజీ చైర్మెన్, ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి మహిమలూరు వాసి అని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు శ్రద్ధాసక్తులతో అభ్యశించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన కోరారు. సతీష్‌రెడ్డి స్ఫూర్తితో భారతకీర్తిపతాకాన్ని ప్రపంచ వినువీధుల్లో ఎగురవేసేలా మహిమలూరు విద్యార్థులు ప్రతినబూనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపవిద్యాశాఖాధికారి జానకిరామయ్యను శాలువా,పుష్పగుచ్ఛంలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నక్ష ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు..



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** భారత కేంద్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న నక్ష ట్రైనింగ్ వర్క్ షాప్ చివరి రోజు శిక్షణకు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ శుక్రవారం హాజరయ్యారు. బిఎన్ యుగంధర్ సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్ మీనా ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో కమిషనర్ నందన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 123 యుఎల్‌బిలకు గాను నక్ష ప్రాజెక్టును 10 యుఎల్‌బిలలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారని, తొలి విడతలో కుప్పం, ఒంగోలు, అనంతపురం మున్సిపల్ కార్పోరేషన్లలో ప్రారంభించారని తెలిపారు. తొలి విడతలో నక్ష పైలెట్ ప్రాజెక్టును 90 శాతం గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తిచేసి విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి అనంతపురం, కుప్పం, ఏలూరు, గుంటూరు, మంగళగిరి, కాకినాడ, కర్నూలు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గాంధీజీకి నివాళి : ఇన్‌చార్జ్ మేయర్, అధికారులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం లో ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇన్చార్జి కమిషనర్ శ్రీలక్ష్మి, కార్యాలయ అన్ని విభాగాల అధికారులు పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారతదేశ స్వతంత్ర సంగ్రామంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్రను అందరు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ హిమబిందు, నగర పాలక సంస్థ ఎస్ఈ రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి,సూపరింటెండెంట్ నరేంద్ర, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మస్టర్ పాయింట్లు తనిఖీ చేసిన ఇన్‌చార్జ్ మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ శుక్రవారం ఉదయం వివిధ డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ టిపిఆర్ఓ వాసు బాబుతో కలిసి స్థానిక 42, 48, 49, 50 డివిజన్లలో ఉదయం 5 గంటలకు పర్యటించి డివిజన్ల వారీగా పారిశుద్ధ కార్మికుల మస్టర్ హాజరు వివరాలను తనిఖీ చేశారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాలని, నగరపాలక సంస్థ అందజేసిన రక్షణ ఉపకరణాలను విధుల నిర్వహణలో తప్పనిసరిగా ఉపయోగించాలని కార్మికులకు మేయర్ సూచించారు. ఇంటింటి చెత్త సేకరణలో తడి పొడి వ్యర్థాలను తప్పనిసరిగా విడివిడిగా సేకరించాలని, రీసైక్లింగ్ విధానానికి ప్రజలందరూ సహకరించేలా అవగాహన కల్పించాలని కార్మికులకు మేయర్ సూచించారు.

# బాల గురువారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే కాకర్ల



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన వరికుంట పాడు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడిన వరికుంట పాడు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆంధ్ర బాల గురవారెడ్డి ప్రస్తుతం నెల్లూరు నగరంలోని వీకే హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న గౌరవ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాస్పిటల్‌కు వెళ్లి బాల గురవారెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని, చికిత్సపై సంతృప్తి వ్యక్తం చేసి, బాలగురవారెడ్డి ధైర్యం చెప్పి, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అలాగే ఈ కష్టకాలంలో తాను మాత్రమే కాకుండా తెలుగుదేశం పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని, అవసరమైన సహాయం ఎల్లవేళలా అందిస్తామని హామీ ఇచ్చారు. బాల గురవారెడ్డి గారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు.

# వీపీఆర్ నేత్రను సద్వినియోగం చేసుకోండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సారథ్యంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య వాహన సేవలను పరుచుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి తెలిపారు. శుక్రవారం వింజమూరులో విపిఆర్ నేత్ర కో ఆర్డినేటర్ శంకర్ తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీపీఆర్ నేత్ర పేరుతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉదయగిరి నియోజకవర్గం లోని కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో గత ఏడాది నవంబర్ మూడో తేదీన నియోజక వర్గంలోని రామాపురంలో దంపతులు అధికారికంగా విపిఆర్ నేత్రను ప్రారంభించారన్నారు. అందులో భాగంగానే వరికుంటపాడు సీతారామ పురం ఉదయగిరి దుత్తలూరు మండలాలలో పూర్తిస్థాయిలో వైద్య శిబిరా లను ఏర్పాటు చేసి అవసరమైన వారికి కళ్ళజోడును పంపిణీ చేశారన్నారు. అలాగే ఫిబ్రవరి 2వ తేదీన మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నల్లగుండ్ల క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరిన గ్రామం నుండి కంటి వైద్య వాహన సేవలో ప్రారంభమవుతాయన్నారు. ప్రతి గ్రామంలో కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అక్కడికక్కడే కళ్ళజోళ్లను పంపిణీ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. అధునాతనమైన మొబైల్ ఐ క్లినిక్ బస్సు ద్వారా ఈ సేవలో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ వాహనంలో లేన్సో మీటర్ ఏఆర్ మిషన్ వంటి అత్యాధునిక పరీక్షా పరికరాలు, కళ్లజోళ్ళు తయారీకి అవసరమైన యంత్రాలు అక్కడే ఉంటాయన్నారు. కావున వింజమూరు మండలంలోని కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాల్లో జరుగుతున్న శిబిరాలకు విచ్చేసి పరీక్షలు నిర్వహించుకొని అవసరమైన చికిత్స సేవలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్ నాయుడు మాల్యాద్రి నాయుడు కోడూరు నాగిరెడ్డి నూతలపాటి జయలక్ష్మి ఆరి కొండ శ్రీనివాసులు కాటం రమణారెడ్డి చల్ల శ్రీనివాసులు యాదవ్ షేక్ రఫీ బండారు సత్యనారాయణ అంబటి ఈశ్వర్ రెడ్డి పల్లా మధులు ఉన్నారు.

# ఇష్టంతో కష్టపడితే ఫలితాలు అద్భుతం : విశ్రాంత డిఎంహెచ్ఓ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఇష్టంతో కష్టపడితే ఫలితం అద్భుతంగా ఉంటాయని విశ్రాంత డీఎంఅండ్‌హెచ్ఓ కె.మాశిలామణి పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరులోని నేతాజీ వికాస్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ కె.వి రత్నం ఆధ్వర్యంలో జరిగిన ఫేర్వెల్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇప్పటినుండే ఇష్టంతో కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని ఇది జీవితానికి ఎంతో ఇబ్బందికరంగా ఉంటుందన్నారు కావున విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి పోలంకషంగా చదివే అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాలలో లేదా కళాశాలలో అధ్యాపకులు బోధించే విషయాలను శ్రద్ధగా ఆలకించాలన్నారు. కళాశాల నుండి ఇంటికి వెళ్ళగానే జరిగిన విషయాన్ని మనం చేసుకోవాలన్నారు. అప్పుడే ఎక్కువకాలం గుర్తుంచుకునే వేలు ఉంటుందని తెలిపారు. గతంలో మేధావులందరూ ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి మైళ్ళకొలది దూరం వెళ్లి గ్రంథాలయాల ఆశ్రయించి ఎంతో జ్ఞానాన్ని పొందాలని ప్రస్తుతం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని కనుక తమ విద్యను చక్కగా కొనసాగించాలన్నారు. అప్పుడే నీ జీవితం బంగారం అవుతుందని ఆయన తెలిపారు కళాశాల డైరెక్టర్ ఎల్‌సి రమణారెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో ఫేర్వెల్ డే వెల్కమ్ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల విద్యార్థుల్లో ఐక్యత భావాన్ని పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు విద్యార్థులు ఒకరికొకరు స్నేహభావంతో కలిసి ఉండేలా ఇది చక్కని వేదికగా ఉంటుందన్నారు. విద్యార్థులందరూ చక్కని వేషధారణతో క్రమశిక్షణాయతంగా పాఠశాలల్లో ఉండాలన్నారు. ఇప్పటినుండి విద్యార్థులు సేవాభావాన్ని కలిగి దేశభక్తి పూర్వ కమైన భావాలను పెంపొందించుకోవాలన్నారు. తదుపరి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తమ తమ కార్యక్రమాలను ప్రదర్శించడంలో పోటీలు పడ్డారు అనంతరం ముఖ్యఅతిథి అయిన మాశిలామణిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నేతాజీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గురజాల గోపి కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు ఏ.గురుస్వామి విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

# అవార్డు గ్రహీతలకు, ఆత్మీయ సన్మానం



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఈనెల 26న నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు జిల్లా నుంచి ఉత్తమ అధికారులుగా కలెక్టరేట్, విద్యుత్ కార్పొరేట్, డిస్కం విభాగాలలో పురస్కారాలు అందుకున్న అవార్డు గ్రహీతలకు శుక్రవారం ఆత్మీయ సన్మాన సత్కార కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 77వ రిపబ్లిక్ డే సందర్భంగా బెస్ట్ ఇంజనీరు పురస్కార గ్రహీత జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీరు కే.రాఘువేంద్రంతోపాటు కలెక్టరేట్, కార్పొరేట్ ఆఫీసులో అవార్డులు పొందిన గ్రహీతలను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బెస్ట్ ఆఫీసర్‌గా ఎన్నికైన జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘువేంద్రంను కూడా ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బెస్ట్ ఇంజనీరు అవార్డు గ్రహీత కే.రాఘువేంద్రం మాట్లాడుతూ.. ఈ అవార్డులు తన ఒక్కరి కృషి వల్ల కాకుండా, జిల్లా విద్యుత్ శాఖలోని ప్రతి ఉద్యోగి కలిసికట్టుగా అంకితభావంతో పనిచేసిన కృషి ఫలితంగా లభించాయని తెలిపారు. ఉద్యోగుల సమిష్టి కృషి, నిబద్ధత, సేవాభావమే ఈ అరుదైనగౌరవానికి కారణమని తెలిపారు. కలెక్టరేట్ అవార్డులు పొందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎస్. బెనర్జీ (కావలి), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు యు.ప్రభాకరరావు (రూరల్ సబ్ డివిజన్), కార్పొరేట్ అవార్డులు పొందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం శ్రీధర్ ( నెల్లూరు టౌన్ ఆపరేషన్ డివిజన్), కార్పొరేట్ ఆఫీస్ అవార్డు పొందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుధాకర్, కలెక్టరేట్ అవార్డు పొందిన అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ మహేష్, అలాగే కలెక్టరేట్ అవార్డు పొందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సింగిరి లక్ష్మీబాయి (డైకాస్ రోడ్డు సెక్షన్)లకు పేరుపేరునా ఆత్మీయ సన్మాన కార్యక్రమం శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలచంద్ర, నెల్లూరు రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లక్ష్మీనారాయణ, కన్ స్ట్రక్షన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పరంధామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మునీంద్ర, టి.కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# కూలిన కల్వర్టును పరిశీలించిన సర్పంచ్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలో చిట్టేటి మెట్టకు వెళ్లే మార్గంలో కల్వర్టు కూలిపో వడంతో సర్పంచ్ ఎన్.సుజనా పరిశీలించారు. కల్వర్టు ఆ గ్రామంలోని వారికి రాకపోకలకు ఇబ్బం దికరంగా మారింది. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. ప్రస్తుతం కూలిపోయిన కల్వర్టు ప్రాంతంలో నూతన కల్వ ర్టును ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసే విధంగా తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ రాయుడు కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# మర్రిపాడులో దొంగలు బీభత్సం

- ఐదు దేవాలయాల్లో చోరీ
- ఐదు లక్షల మేర అపహరణ అంచనా



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో ఒకేరోజు రాత్రి గుర్తు తెలియని దుండగులు రెండు గ్రామాలకు సంబంధించిన ఆలయాల్లో చోరీలకు పాల్పడి బీభత్సం సృష్టించారు. ఆ ఆలయాల్లోని హుండీలు పగలగొట్టడంతో పాటుగా దేవతల దేవుళ్ళ మెడలో నుంచి నగలు కూడా అపహరించుకొని పోయారు. దీనిని బట్టి నగదు, నగలకు సంబంధించి సుమారు 5లక్షలు మేర ఉంటుందని ఆయా గ్రామాల గ్రామస్తులు అంచనా వేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. మర్రిపాడు మండలంలోని చిలకపాడు గ్రామంలో దేవాలయాల్లోనీ ఆభరణాలు, హుండీలలోని నగదు ఎత్తుకెళ్ళారు. రాములవారి గుడి, అంకాలమ్మ గుడి (సన్నువారిపల్లి) పోలేరమ్మ గుడి, వీరబ్రహ్మేంద్రస్వామి గుడి, ఆశ్రమం సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి (చిలకపాడు) గ్రామాలలోనీ దేవాలయలలో చోరీలు జరగడంతో ఆయా గ్రామాల ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఆ రెండు గ్రామాల్లోని ఆలయాల వద్దకు ఉదయాన్నే తగు పురోహితులు పూజలు చేయడానికి వెళ్ళగా ఈ తంతు బయటపడింది. వెంటనే గ్రామాల్లోని పెద్దలకు పూజారులు తెలియజేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు తోటి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలతో సతమతమవుతున్న అరుంధతియ వాడ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని అరుంధతివాడ అనేక సమస్యలతో సతమతమవుతుండగా ఆ సమస్యలను గుర్తించిన సర్పంచ్ ఎన్.సుజనా ఆ గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి గ్రామానికి ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి అవసరమైన విద్యుత్ స్తంభాలు నీటి సరఫరా మురుగు కాలువలు వీధికొలాయిలు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను విన్న ఆమె స్పందించి నీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ కాలనీవాసులు సంజీవరాయుడు తదితరులున్నారు.

## పాఠశాలను సందర్శించిన డైట్‌లెక్చరర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పల్లి పాడు ఉపాధ్యాయశిక్షణాకేంద్రం(డైట్) సీనియర్ లెక్చరర్ ఎస్ఎన్ ఖాజారసూల్ శుక్రవారం సంద ర్శించారు. ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని జి.నీరజనడిగి స్కూలు వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న జిఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం సంబంధించి ఉపాధ్యాయులు ఇంగ్లీషు, తెలుగు, గణితం విషయాలతో తయారుచేసిన ఇంటరాక్టివ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించి వాటిని విద్యార్థులు ఎలా ఉపయోగిస్తారో నీరజనడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా ఆయన పరిశీలించారు. అన్నింటిపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని జి.నీరజ, ఉపాధ్యాయులు శ్రీదేవి, సుధారాని, జయరాములు, అనూరాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి జాతిపిత పేరును కొనసాగించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి జాతిపిత మహాత్మాగాంధీ పేరును కొనసాగించాలని సీపీఎం నాయకుడు షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కేంద్రం అమలు చేసిన నూతన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని మండలంలోని బండగానిపల్లి ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలు, రైతులు, కూలీలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం పేరు మార్చి నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. పేదలకు పని హక్కును కాలరాసిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అటవీ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని వినతి



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** అటవీ భూములు, సిఆర్‌జెడ్ భూముల తోపాటు మడ అడవులులో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో పరిపాలన అధికారికి ఏపీ కోస్టల్ ట్రెడిషనల్ ఫిషర్మెన్ ప్రొటెక్షన్ ఫౌండర్ ప్రెసిడెంట్ వి.చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ తీర ప్రాంతాలలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని నిరోధించాలని కోరారు. అదేవిధంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆధీనంలో ఉన్న విడవలూరు మండలంలోని వరిణి –ఊటుకూరు రెవెన్యూ సముద్ర తీరప్రాంత గ్రామాలలో అటవీ భూముల తోపాటు సిఆర్జెడ్ భూములు, మడ అడవులను యదేచ్చగా ఆక్రమించారని, సహజ వనరుల విధ్వంసానికి వైట్ కాలర్ నేరగాళ్లు ఒంటేరు నాగేంద్ర భానురెడ్డిలు పాల్పడ్డారని ఆరోపించారు. మడ అడవుల నరికివేసీ తెర ప్రాంత భూములలో రొయ్యల గుంటలు ఏర్పాటు చేశారన్నారు. రసాయనాల వినియోగం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింతుందన్నారు. మత్స్యకార జీవన ప్రాంతాలలో చట్ట వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థాన తీర్పులకు విరుద్ధంగా భూ ఆక్రమణలు జరిగాయని, వైట్ కలర్ నేరగాళ్లు ప్రకృతి వనరులను దోపిడీ చేసి సొంత ఆస్తులు లాగా చలామణి చేస్తూ బినామీలుగా లీజులకు ఇస్తున్నారన్నారు. రసాయనాలు ఎక్కువగా వాడడం వలన మంచినీటి బావులు విషపూరిత మవుతున్నాయని, ఫలితంగాతీర ప్రాంతంలో మత్స్య సంపద సముద్ర జీవ రాశులు అంతరించిపోతున్నాయన్నారు. భూ ఆక్రమణ నిరోధక చట్టం కింద భారీ జరిమానాల విధించాలని, వైట్ కలర్ నేరగాలపై రౌడీషీట్లు పీడీ యాక్ట్ నమోదు చేయాలని తన విజ్ఞాపన పత్రంలో చిట్టిబాబు పేర్కొన్నారు.

# జూనియర్ కళాశాలలో స్పర్శ లెప్రసీపై అవగాహన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామం నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు స్పర్శ లెప్రసి కార్యక్రమంపై అవగాహన, లక్షణాలు గురించి జిల్లా మలేరియా అధికారిణి హుసేనమ్మ వివరించారు. అనంతరం సౌత్‌మోపూర్ గ్రామంలోని ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పరిశీలించి తీసుకో వాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రధానంగా కుష్టు వ్యాధి లక్షణాలలో చర్మంపై స్పర్శ లేని మచ్చులు, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పి లేని బొడిపెలు, కనురెప్పలు కనుబొమ్మలు వాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, వాపులు, ముక్కదూలం అనిగిపోవుట గాని, గాలి ఆడకపోవడం గాని జరుగుతుందని, బొటనవేలు, చిటికెనవేలు, మనికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్ళు నేలకు రాసుకోవడం, పాదాలలో చెప్పులు జారిపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు పుండ్లు రావడం జరుగుతుందని, కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియం లేప్రీ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం వలన, దగ్గడం వల్ల వ్యాప్తి చెందుతాయని, వ్యాధి లక్షణాలు కనిపించుటకు మూడు నుండి ఐదు సంవత్సరాలు పట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ మోపూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, ఎంపిహెచ్‌ఈఓ పెంచలయ్య, హెల్త్ అసిస్టెంట్ విజయ సారథ, హెల్త్ సూపర్వైజర్ షేక్ రసూల్ బి, గ్రామ ఉపసర్పంచ్ చల్లా నరసయ్య, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లలో నిర్దేశించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించండి : టీపీఆర్‌ఓ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో సూచించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టిపిఆర్‌ఓ వాసుబాబు క్యాంటీన్ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక 46వ డివిజన్ ఇందిరా భవన్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం ఉదయం సందర్శించి ప్రజలకు అందుతున్న అల్పాహారం నాణ్యత, ప్రమాణాలను పరిశీలించారు. స్వయంగా క్యాంటీన్లో ఆహారాన్ని స్వీకరించి నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ.. క్యాంటీన్లో అందుతున్న సౌకర్యాలు, నిర్వాహకుల ప్రవర్తన గురించి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ నగరవ్యాప్తంగా ఉన్న అన్ని అన్న క్యాంటీన్లలో చల్లటి, సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని క్యాంటీన్ నిర్వహకులకు సూచించారు. నిర్దేశించిన మోతాదు నాణ్యమైన ఆహారం అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాలను



ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహారం ప్లేట్లు, ఇతర వంట సామాగ్రిని క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకొని, విచ్చేసే ప్రజలతో సాదరంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు క్యాంటీన్‌కు విచ్చేసి ఆహారం స్వీకరిస్తున్న వారి సంఖ్య, సరఫరా చేస్తున్న ఆహారం మోతాదు, తదితర వివరాలను ఎప్పటికప్పుడు క్యాంటీన్ల వారీగా నివేదిక అందించాలని నిర్వాహకులకు సూచించారు.




# వాసిలి, నువ్వురుపాడుల్లో రైతుశిక్షణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు, వాసిలి గ్రామాల్లో శుక్రవారం జిల్లా వనరులకేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నువ్వురుపాడులో పొగాకు, వరిపంటలకు బదులుగా ప్రత్యామ్నాయపంటగా మొక్కజొన్న సాగుచేయగా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్ర సమాయ వ్యవసాయ సంచాలకులు సి.మారుతీదేవి మాట్లాడుతూ.. రైతులు భూసారపరిక్షలఫలితాలకనుగుణంగా ఎరువులు వాడడం వలన ఖర్చు తగ్గించుకోవడంతోపాటు నేల ఆరోగ్యం, భూసారం పెంపొందించు కోవచ్చన్నారు. 20-20-0-13 లాంటి ఎరువులను వాడకుండా యూరియాను దపదపాలుగా వరిలో వాడుకోవచ్చన్నారు. కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులతోపాటు జీవన ఎరువులైన ఆర్ఎస్‌బి, పొటాషియం, రిలీజియన్‌బాక్టీరియా, అజోస్పెరిల్లమ్ లాంటి వాటిని వాడడం వలన వేసిన ఎరువుల సామర్థ్యం పెంచడంతోపాటు సాగుఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు వారు అవగాహన కల్పించారు. రైతులు వరిపంటకు ప్రత్యాయ మ్నాయంగా శన, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగుచేసుకోవాలని, తద్వారా నికర ఆదాయం పెంపొందిచుకోవచ్చని వారు పేర్కొన్నారు. రైతులు మొక్కజొన్న సాగుచేస్తే అందించే ప్రోత్సాహకాలను వారు వివరించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు, విఏఏలు నితీష్‌కుమార్, దివ్యశ్రీ, వాసిలి, నువ్వురుపాడు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయండి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని అన్ని పంచాయతీలలో ఇంటి పనులు నూరు శాతం వసూలు చేయాలని ఆత్మకూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారి టి.రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఏఎస్పేట ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఓ రమణయ్య మాట్లాడుతూ.. ఇంటి పన్నులు వసూలు, స్వామిత్వ, సర్వేలు మీద రివ్యూ సమావేశం నిర్వహించారు ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయుటకు పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు ఫిబ్రవరి 15 నాటికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ప్రసన్న కుమారి డిప్యూటీ ఎంపీడీవో ఎన్.మునిరత్నం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వచ్చేనెల 1వ తేదీన వెలుగొండ సాధన సమితి, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానిన విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనన్న బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు అధిక నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా నిధులు సక్రమంగా కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి చేసి మెట్ల ప్రాంత వాసుల సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపారాదని ఏకాగ్రతతో వాహనాలు నడిపి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డి, వైద్యులు ఠాగూర్‌లు సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ రమేష్ కుమార్ అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య తిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనం నడిపే సమయంలో ఇతరులతో, సెల్‌ఫోన్‌లో మాట్లాడడం చేయరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలన్నారు. ప్రమాద రహిత డిపోగా పేరు తెచ్చేందుకు డ్రైవర్‌లు కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఎంపికైన షేక్‌ఎం బాషా, ఎంకేవీ సింగ్, నరసింహాద్రిలను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగభూషణం, ఏఎంఎఫ్ నారాయణ, ఏడీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్టు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈ ఏడాది ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, జనవిజ్ఞాన వేదిక నాయకులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దారు షేక్ షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందరర్భంగా వారు మాట్లాడుతూ కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరాలంటే వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. 1996లో ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేశారని, అప్పటి నుంచి ప్రాజెక్టు పనులు నత్తతో పోటీ పడుతున్నాయన్నారు. ఇప్పటికే 65 శాతం పనులు పూర్తి చేసుకున్న ప్రాజెక్టుకు ప్రస్తుతం జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో రూ.4,500 కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసి మెట్ట ప్రాంత ప్రజలు కష్టాలు తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాదాల శ్యాంప్రసాద్, జేవీవీ సీనియర్ నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, దాసరిపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ఘనంగా స్వర్ణ రథోత్సవం

## శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలక్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు శుక్రవారం స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొని రథాన్ని లాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆరుద్రోత్సవంలో భాగంగా తెల్లవారుజామున శివుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా చేపట్టారు. ఉత్సవంలో భాగంగా కళాబృందాలు కోలాటం, తప్పెట నృత్యాలు లాంటి పలు జానపద కళారూపాలు నిర్వహించాయి. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామి వారికి స్వర్ణ రథం అందించిన విషయం విదితమే. రథోత్సవ వేడుకలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం వచ్చాక.. కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు

## రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి భరోసా



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న పరిస్థితుల్లో ఉన్నటువంటి కార్యకర్తలతో పాటు నాయకులకు అధికారం వచ్చిన తర్వాత తగిన గుర్తింపు విలువలు ఉంటాయని రాష్ట్ర మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై ఆ పార్టీ నాయకత్వంతో విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. హాస్టల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపడం ఎవరి తరం కాదు రాబోయే రోజుల్లో మనదే విజయం మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి అని పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. అనంతరం రాష్ట్ర మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు. యువ రక్తంతోనే రాజకీయం మారుతుందని పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టమైన కమిటీలు ఏర్పాటు చేసిందని రాష్ట్ర మాజీ మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని అవినీతి అక్రమాలు ప్రజలు భరించలేకపోతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ శాసనసభ సాక్షిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానే చంద్రబాబును కోరిన మేరకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఆపివేశారని చెప్పినట్లు తెలిపారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందన్నారు. శ్రీశైలంలో దిగు స్థాయి నుండే తెలంగాణ రాష్ట్రం రోజుకు 8 టీఎంసీలు నీరు తీసుకుపోతుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం నీరు కూడా తీసుకోలేకపోతుందని విమర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 25కోట్ల రూపాయల ఫిషింగ్ జెట్టి నిర్మాణం కృష్ణపట్నం పోర్టుకు అప్పగించి పనులు ప్రారంభిస్తే ప్రస్తుతం పోర్ట్ యాజమాన్యం ఆ పనులు ఎందుకు నిలిపివేసిందో అర్థం కావడం లేదన్నారు. తమ ప్రభుత్వంలో నాన్ ఫిషర్మెన్ ప్యాకేజీ 25వేల రూపాయలు ఇవ్వగా ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 41వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఇంకా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ సుగుణ, జడ్పిటిసి వెంకటసుబ్బయ్య, పార్టీ నాయకులు దువ్వూరు కోదండరామరెడ్డి, మస్తాన్, నెల్లూరు శివప్రసాద్, సర్పంచులు భక్తాని కనకయ్య, ఆలపాక శ్రీనివాసులు, ఎంపిటిసి సభ్యులు, అనుబంధ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# 30 పడకల ప్రభుత్వ హాస్పిటల్ పై ముఖ్యమంత్రితో సమీక్ష

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే తొలిసారిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమశిల జలాశయాన్ని సందర్శించిన విషయం విధితమే. ప్రజా వేదికలో సోమశిల గ్రామానికి 30 పడకల హాస్పిటల్ కావాలని గ్రామస్తులు కోరగా మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలోని ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు గుంద్రా సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ఆనం విలేకరులతో మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షించామన్నారు మన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సోమశిల గ్రామంలోని 30 పడకల ఆసుపత్రి పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రి ఆనం చర్చించారు. 30 పడకల ఆసుపత్రిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ విషయంపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో చర్చించామని త్వరలో హాస్పిటల్ మంజూరు అవుతుందని అన్నారు. మర్రిపాడు మండలంలో 55 లక్షల రూపాయలతో పబ్లిక్ హెల్త్ భవనాన్ని నిర్మించామని త్వరలో ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలో విలేజ్ హెల్త్ సెంటర్లకు శాశ్వత భవనాల కోసం ఐదు కోట్ల 35 లక్షల నిధులతో పనులు ప్రారంభించామన్నారు. సోమశిల జలాశయంలో నీరు తగ్గిన తర్వాత త్వరలో అఫ్రాన్ పనులు జరుగుతాయని ఆయన వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేయడం సబబు కాదన్నారు. సోమశిల గ్రామాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. సోమశిల నుంచి ఉప్పలపాడు వరకు నాలుగు కోట్ల రూపాయలతో రహదారి పనులు చేసున్నట్లు అన్నారు. ప్రభుత్వ సలహాదారులు గుంద్రా సతీష్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అదనంగా రహదారులకు నిధులు మంజూరయ్యాలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఉప్పల విజయకుమార్,నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మునగపాటి సునీత సుబ్బరాజు, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు రేవతి చౌదరి, బొర్రా బాబు, ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్, జనసేన మండల అధ్యక్షులు ఉదయగిరి రవి, సోమశిల జనసేన నాయకులు ఎం.కృష్ణ, ఏఎంసి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యోగు పెంచలయ్య, గువ్వల పెంచలయ్య, కొప్పాల నరసింహులు, సన్నపురెడ్డి జనార్దన్‌రెడ్డి, చల్లా వెంకటరమణారెడ్డి, జంజం నారాయణ, ముక్కు పుల్లయ్య గౌడ్, చల్లా వెంకటరెడ్డి, కొండ్రెడ్డి రామిరెడ్డి, మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రెహమాన్, మైనార్టీ నాయకులు కాశీం భాష, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మెట్టుకూరు మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారికి రాహుకాల ఉద్యాపన పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం విశేషంగా రాహుకాల ఉద్యాపన పూజలో పాల్గొని శ్రీ అమ్మవారికి చీరజాకెట్టు, 108 నిమ్మకాయల మాలలు సమర్పించారు. రాహుకాల దీపాలు చేసి శ్రీ అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రతి శుక్రవారం భక్తుల విరాళముల ద్వారా దేవస్థానం తరపున అన్నదాన కార్యక్రమం జరుగుచున్నది. ఈ శుక్రవారం 3వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నైమిశారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మిక సేవాసంస్థ వ్యవస్థాపకులు పరమ పూజ శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి చే శ్రీ రాజరాజేశ్వరి తత్వం గూర్చి ప్రవచనం చేయడం జరిగింది. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం శ్రీ అమ్మవారికి ఊంజల్ సేవ కార్యక్రమాలు జరుగును. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు కార్యాలయం నందు టిక్కెట్టు రూ.500/-లు చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకావాలని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు కలశం చెంబు, పూజ టెంకాయ, రవిక తెచ్చుకొనవలెను. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వేదపారాయణం 6.30 గంటలకు సంధ్యామేళం రాత్రి 7.30 గంటలకు కుంభ హారతులు, 8 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు జరిగాయి.

## నందీశ్వరునికి ప్రదోషకాల పూజ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఉప ఆలయం అయిన శ్రీ మీనాక్షి సమేత శ్రీసుందరేశ్వర స్వామి వారి దేవస్థానం నందు త్రయోదశి సందర్భంగా శుక్రవారం ప్రదోషకాల పూజ, శ్రీ సుందరేశ్వర స్వామి వారికి, నందీశ్వరునికి అభిషేకాలు వేద పండితులు, అర్చకులచే అత్యంత వైభవంగా జరిగాయి. పై కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారి అభిషేకాన్ని తిలకించడం జరిగి అనంతరం స్వామి వారి పంచామృతం, పులిహోర ప్రసాదంగా స్వీకరించుట జరిగింది. పై కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో జరిగాయి.

## చేసిన తప్పులు మళ్ళీ చేయొద్దు : న్యాయమూర్తి



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** క్షణికావేశంలోనో ఉద్దేశపూర్వకంగానో తప్పులు చేసి జిల్లా జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు రిమాండ్ ఖైదీలు చేసిన తప్పులు మళ్ళీ చేయకుండా విడుదల అనంతరం సమాజంలో మంచి జీవితాన్ని ప్రారంభించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి పిలుపునిచ్చారు. శుక్రవారం సెంట్రల్ జైలు ప్రాంగణాన్ని పరిశీలించి ఖైదీల వసతుల గురించి తనిఖీ చేసి అనంతరం న్యాయమూర్తి ఖైదీలను ఉద్దేశించి ప్రసంగించారు. నేరాలు చేసినందువల్ల కుటుంబసభ్యులు మనోవేదనకు గురవుతారని సమాజం వారిని చిన్నచూపు చూస్తుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. కష్టపడి కుటుంబాన్ని పోషించుకోవాలని జాతిపిత గాంధీజీ సిద్ధాంతాలు అలవర్చుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్ర కారాగారం నందు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముందుగా ఖైదీలకు అందిస్తున్న భోజనం వసతులు వైద్య సదుపాయం అడిగి తెలుసుకున్నారు. తదుపరి వారి యొక్క కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాయర్ లేని వాళ్లకు ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరమైన న్యాయ సహాయం కోసం లీగల్ కౌన్సిల్ మెంబర్స్‌ను సంప్రదించవలసి నదిగా సూచించారు. అలాగే కేంద్ర కారాగారం నందు పేరా లీగల్ వాలంటరీని ఏర్పాటు చేశామని వారి ద్వారా అవసరమైతే న్యాయ సహాయం కోసం అర్జీల రూపంలో ఇవ్వవలసిందిగా కోరినారు తదుపరి గ్రీవెన్స్ బాక్స్‌ను ఓపెన్ చేసి చూశారు. తదుపరి మహిళా ఖైదీలను అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ టి.గోపాల్ రెడ్డి డిప్యూటీ చీఫ్ హర్ష ముజీబ్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.